క్లుప్తంగా

నూతన విద్యావిధానం రద్దు చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. పాలమూరు యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలువురు మాట్లాడారు. అధ్యక్షుడు జోగుర మేష్ ఈ విధానం వల్ల పేదలకు విద్య దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. నాయకులు రామకృష్ణ, అంజి, భరత్, పవన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1 నుంచి విగ్రహాల ప్రతిష్ఠ

జడ్చర్ల టౌన్: నసురుల్లాబాద్ శివాలయం పునఃనిర్మాణం చేయటంతో నూతన సంవత్సరం జనవరి 1నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ ప్రణీల్‌చందర్ తెలియజేశారు. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే ప్రతిష్ఠ ఉత్సవాలకు అధికసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

నవాబుపేట: కొల్లూర్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శుక్రవారం నూతన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు జవాబుదారీగా ఉంటామన్నారు. కొల్లూర్‌కు ఇచ్చిన మాట ప్రకారం మండల కోరిక త్వరలోనే తీర్చనున్నట్లు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వారిని తిరిగి తీసుకోవద్దు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కోడ్‌ను ధిక్కరించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 6 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవద్దని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రాజు.. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కుందన్‌యాదవ్‌ను కలిసి విన్నవించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల ఖర్చులపై నిర్వహించిన సమీక్షలో వినతిపత్రం సమర్పించారు.

హెచ్‌ఎంకు సన్మానం

దేవరకద్ర: కౌకుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం అబ్దుల్ హక్‌ను గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నపూర్ణ, సర్పంచ్ స్వప్న, విద్యాకమిటీ చైర్మన్ రాజు, కిషన్‌రావు, సుమన్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వం వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి కోరారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమైక్య జాతీయ సదస్సు కోల్‌కతాలో జరుగుతున్న నేపథ్యంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. పలు అంశాలను వెల్లడించారు. జిల్లా కార్యదర్శి చంద్రానాయక్, కోశాధికారి కృష్ణమోహన్, క్రీడా కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, యుగేందర్‌నాయుడు పాల్గొన్నారు.

నిత్యం గోసే!

నవాబుపేట: ఆధార్ కేంద్రం చెంత జనం నిత్యం గోస పడుతున్నారు. 54 గ్రామాలకు ఒకే కేంద్రం ఉండటంతో ఒకేసారి జనం కార్డుల అప్‌డేట్ కోసం వస్తుండడంతో నిత్యం గందరగోళం చెలరేగుతోంది. శుక్రవారం వారం సైతం రెండు క్యూలైన్లు ఉండగా జనం పెద్ద ఎత్తున గుమిగూడి ఎగబడటంతో పోలీసులు వచ్చి క్యూలైన్లు ఏర్పాటు చేసే పరిస్థితి దాపురించింది. దీంతో ఆధార్ కష్టాలు ఎప్పుడు తీరేనో అంటూ జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్ ప్లాజాలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వనపర్తి జిల్లా కొత్తకోట ఫైర్ ఆఫీసర్ శంకర్ ఆధ్వర్యంలో స్థానిక టోల్‌ప్లాజాలో పని చేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. టోల్‌ప్లాజా ప్రాజెక్టు హెడ్ దీపా మాడియా, మేనేజర్లు సంతోష్, రాకేష్‌గౌడ్, బాలమురుగన్, దిలీప్‌కుమార్, జితేందర్, రాజ్‌కమల్ ఉన్నారు.


మహబూబ్‌నగర్ 16వ వార్డులోని బోయపల్లిలో పోటెత్తిన ప్రజలు


మూసాపేటలో దరఖాస్తులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ యాదయ్య


జడ్చర్ల 6వవార్డులో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ


మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలోని భవానీ తండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సాక్షినెట్‌వర్క్: ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో గ్రామాలు, పట్టణాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్యక్రమం జిల్లా రెండోరోజు కొనసాగింది. ఆయా గ్రామాల్లో ప్రజలు దరఖాస్తులు ఇవ్వడం కోసం పోటీపడ్డారు.

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం మొత్తం 4,861 అభయహస్తం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. రెండు రోజులకు కలిపి 7,994 మంది నుంచి దరఖాస్తులు అందినట్లు వివరించారు. ఒకటో వార్డులో 415, మూడో వార్డులో 755, ఐదో వార్డులో 291, ఆరో వార్డులో 303, ఏడో వార్డులో 315, 11లో 739 దరఖాస్తులు వచ్చాయి. 13లో 510, 16లో 525, 18వ వార్డులో 466, 19లో 297, 23లో 918, 33లో 418, 43లో 370, 44లో 684, 46లో 700 అదేవిధంగా 49లో 288 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- భూత్పూర్ మండలంలోని కొత్త మొల్గరలో 687, తాటికొండలో 894, రావులపల్లిలో 200, కప్పెటలో 278 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ మున్నీ తెలిపారు. మున్సిపాలిటీ లో 1079 మంది దరఖాస్తులు ఇచ్చినట్లు కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు.
- మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలో అప్పాయిపల్లి, రామచంద్రాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ సుందర్‌రాజ్, ఫతేపూర్, భవానీ తండాల్లో ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. సర్పంచ్‌లు ఊశన్న, కుర్వ రాణెమ్మ, అలివేలు, పూర్యానాయక్, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, గిర్దావర్ క్రాంతికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 6వవార్డులో నిర్వహించిన సభను జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ మోహన్‌రావు సందర్శించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆలూరులో జెడ్పీవైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య దరఖాస్తులు తీసుకున్నారు. మండలంలోని ఆలూరు, బూర్గుపల్లి, కొండేడ్, కోడ్గల్‌తో పాటు మున్సిపాలిటీ పరిధిలోని 6, 7, 8, 9వార్డుల్లో కార్యక్రమం సాగింది. మున్సిపాలిటీలో 1100లకుపైగా దరఖాస్తులు రాగా నాలుగు గ్రామాల్లో 1308 దరఖాస్తులు అందాయి.

మూసాపేటలో 964 దరఖాస్తులు

మూసాపేట, జానంపేట గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీడీఓ స్వరూప బృందం దరఖాస్తులను స్వీకరించింది. మూసాపేటలో 364 దరఖాస్తులు, ఇతర సమస్యలపై 78, జానంపేటలో 600 దరఖాస్తులు, ఇతర సమస్యలపై 124 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. డీఆర్‌డీఓ యాదయ్య మూసాపేటలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి తగు సూచనలు చేశారు.

అడ్డాకులలో 1201 దరఖాస్తులు

అడ్డాకుల, కందూర్ గ్రామాల్లో తహసీల్దార్ ఘన్సీరాం, ఎంపీడీఓ మంజుల బృందం దరఖాస్తులు స్వీకరించింది. అడ్డాకులలో గ్యారంటీల కోసం 631, దరఖాస్తులు, ఇతర సమస్యలపై 76 దరఖాస్తులు, కందూర్‌లో గ్యారంటీల కోసం 570 దరఖాస్తులు, ఇతర సమస్యలపై 49 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ ఆయా గ్రామాల్లో పరిశీలన చేశారు.

- దేవరకద్ర మండలంలోని బస్వాయపల్లిలో 229, లక్ష్మీపల్లిలో 144 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ శివరాజు, సర్పంచ్ సుజాత ఇతర అధికారులు పాల్గొన్నారు.
- బాలానగర్‌లో 657, చిన్నరేవల్లిలో 498 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. కాగా ఎక్కువ సంఖ్యలో రేషన్ కార్డుల కోసమే ఇతర దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అయితే వాటికోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక పలువురు ఇబ్బందులు పడ్డారు.
- మిడ్జిల్ మండల పరిధిలో వల్లభ్‌రావుపల్లిలో 520, వేములలో 320, వెలుగొమ్ములలో 273, వాడ్యాల్‌లో 233 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, ఎంపీపీ సుదర్శన్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట పరిధిలోని బండ్రపల్లి, పల్లమరి, పర్ధిపూరం గ్యోప్యానాయక్ తండా తదితర గ్రామాల్లో కార్యక్రమం కొనసాగగా మొత్తం 2,888 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.


వాడ్యాల్‌లో..


పర్ధిపురంలో..


బస్వాయపల్లిలో..

- నవాబుపేట పరిధిలో రెండోరోజు వరకు మొత్తం 2,011 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ శ్రీలత, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తెలిపారు. కాగా శుక్రవారం పుట్టోనిపల్లితండాలో 90, పల్లెగడ్డలో 117, దాయపంతులపల్లిలో 164, కోళ్ల గుట్టతండాలో 40, చిన్నమేగ్యాతండాలో 100 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

నేటి నుంచి మరో 8 వార్డుల్లో..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రజాపాలన'లో భాగంగా మూడో రోజు శనివారం నుంచి మరో ఎనిమిది వార్డుల్లో 'అభయహస్తం' కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. నాలుగో వార్డు పరిధిలో ఎదిర రెవెన్యూ వార్డు కార్యాలయంలో, 21వ వార్డు పరిధిలోని కిరణ్ కాన్వెంట్ స్కూల్ ఎదురుగా, 24వ వార్డు పరిధిలో రామయ్య బౌలి యూపీహెచ్‌సీ భవనం పక్కన, 25వ వార్డు పరిధిలో జిల్లాజైలు సమీపంలో పీర్లమసీదు (పాతపాలమూరు) వద్ద కార్యక్రమం నిర్వహించనున్నారు. 29లో మదీనా మసీదు కమ్యూనిటీ హాలులో, 35లో సంజయ్‌నగర్ కమ్యూనిటీ హాలులో, 40లో షాషాబ్‌గుట్ట దర్గా కమ్యూనిటీ హాల్‌లో, 47వ వార్డు పరిధిలో మహిళా స్వశక్తి భవనం (మున్సిపల్ కార్యాలయం) లో దరఖాస్తులు తీసుకోనున్నారు.

న్యాయం చేకూరుస్తాం

సాక్షినెట్‌వర్క్: పేదలకు న్యాయం చేకూర్చడానికి ప్రజాపాలన కార్యక్రమం చేపడుతున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్త మొల్గర, కప్పెట గ్రామాల్లో చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో దొరల పాలన అంతమై ప్రజా పాలన ప్రారంభమైందన్నారు. మండల ప్రత్యేక అధికారి సాయిబాబా, సర్పంచ్ వేణుగోపాల్, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, పార్టీ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, భూత్పూర్ పట్టణ అధ్యక్షుడు నవీన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కందూర్‌లో అడ్డాకుల మండలానికి చెందిన 24 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. డీఆర్‌డీఓ యాదయ్య, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ ఘన్సీరాం, ఎంపీడీఓ మంజుల, సర్పంచ్ శ్రీకాంత్ నాయకులు పాల్గొన్నారు.

తక్కువ జీతం ఉన్న వారికి అవకాశమివ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్‌బాబా, మహ్మద్ యాఖూబ్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. కాగా తక్కువ జీతంతో జీవితం కొనసాగిస్తున్న ఉద్యోగులకు కూడా పథకాల్లో అవకాశం కల్పించాలని సీఎంకు వారు విజ్ఞప్తి చేశారు. షేక్ మహమూద్, సోహైల్ ఖాన్, అహ్మద్ పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలతో ఆర్థిక చేయూత

గండేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం తమ గ్యారంటీ పథకాలతో ప్రజలకు ఆర్థికంగా చేయూత నివ్వనున్నట్లు పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రెండోరోజు వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి, ఆశిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వెన్నాచేడ్‌లో 931, కొంరెడ్డిపల్లిలో 369, ఆశిరెడ్డిపల్లిలో 193 మంది దరఖాస్తులు అందజేశారు. అదేవిధంగా చౌదర్‌పల్లిలో 308 మంది దరఖాస్తులు అందించారు. ఆయా గ్రామాల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రాజాపూర్: ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ యశ్వంత్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని శుక్రవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి మండల వైద్యాధికారి మధుసూదన్‌రావ్‌తో పాటు సిబ్బంది లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బిల్లులు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న యశ్వంత్‌పై ఇంతవరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్ రవినాయక్‌కు ఫోన్‌చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాపాలన దరఖాస్తుపై సందేహాలెన్నో?

- రేషన్‌కార్డు లేదని ఆందోళన వద్దంటున్న అధికారులు
- దరఖాస్తులు అందజేయవచ్చంటూ సూచనలు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వం ఆరుగ్యారంటీలకు ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులపై అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా రేషన్‌కార్డు లేని వారు తమకు పథకాలు వర్తిస్తాయో లేదోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో నివాసం ఉంటున్నట్లుగా ఆధార్‌కార్డు చూయించి మహిళలు ఎవరైనా రాష్ట్రం అంతా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసుకునే వెసులుబాటు ఇప్పటికే కల్పించింది. మిగిలిన పథకాల్లో మహిళలకు ప్రతినెలా రూ.2500 ఆర్థికసాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి వాటితో పాటు రైతుభరోసా, 200యూనిట్ల విద్యుత్, ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల సాయం తదితరాల కోసం ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తూ దరఖాస్తులను స్వీకరిస్తోంది. వీటిపై ఎంతోమంది ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే రేషన్‌కార్డు లేకుంటే పథకాలు వస్తాయా అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. 2014 నుంచి తొమ్మిదిన్నరేళ్లుగా అప్పటి ప్రభుత్వం నూతనంగా ఎలాంటి రేషన్‌కార్డులు ఇవ్వలేదని... దరఖాస్తులు చేసుకున్నప్పటికీ మంజూరు చేయలేదని పలువురు చెబుతున్నారు. తాము ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న పథకాలకు అర్హత కోల్పోతామేమోనని అపోహ పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అధికారులు ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. రేషన్‌కార్డు ఉన్నా లేకపోయినా ఎలాంటి ఇబ్బంది లేదని.. అర్హత ఉన్న అన్ని పథకాలకు దరఖాస్తు ఇవ్వొచ్చని చెబుతున్నారు.

ఏ గ్రామంలో ఆధార్ ఉంటే అక్కడే..

విద్య, వ్యాపారం, ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాల్లో నివాసం ఉన్నప్పటికీ ఆధార్‌కార్డులో ఉన్న అడ్రస్‌లోనే దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. నివాసం ఉన్నచోట ఆధార్‌కార్డు లేకుంటే దరఖాస్తులు స్వీకరించలేమని చెబుతున్నారు. ఉద్యోగస్తులైన సంతానం కలిగిన వృద్ధులు చేయూత పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, అయితే విచారణలో అర్హత ఉంటేనే మంజూరవుతుందని పేర్కొంటున్నారు.


ఆలూరు గ్రామంలో దరఖాస్తు స్వీకరిస్తున్న జెడ్పీవైస్‌చైర్మన్ యాదయ్య

అర్హత కలిగిన అందరికీ పథకాలు

ఆరుగ్యారంటీలకు సంబంధించి తెల్లరేషన్ కార్డు లేకున్నా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కార్డు నెంబరు రాయాల్సిన చోట లేదు అని రాసిస్తే దరఖాస్తు తీసుకుంటున్నాం. దాంతో పాటు తెల్లకాగితంపై రేషన్‌కార్డు కోసం ప్రత్యేకంగా జనరల్ దరఖాస్తుల విభాగంలో తీసుకుంటున్నాం. ఆరు గ్యారంటీలకు సంబంధించి అర్హులైన వారందరు దరఖాస్తులు చేసుకోవచ్చు. అన్ని విచారించాక అర్హతను బట్టి పథకం అమలు చేస్తాం.

–మహమూద్‌షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

దరఖాస్తులు తీసుకుంటున్నాం

ఆరుగ్యారంటీలకు రేషన్‌కార్డు సంబంధం లేకుండానే దరఖాస్తులు తీసుకుంటున్నాం. అలాగే ప్రజాపాలన సభల్లోనూ రేషన్‌కార్డుకోసం దరఖాస్తులు బాగానే వస్తున్నాయి. శుక్రవారం మండలంలోని కొండేడ్, కోడ్గల్ గ్రామాల్లో నిర్వహించిన సభల్లో రేషన్‌కార్డు కోసం 56 దరఖాస్తులు అందాయి. అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాము.

–జగదీశ్, ఎంపీఓ, జడ్చర్ల

ప్రజల వద్దకే ప్రభుత్వం


రంగారెడ్డిగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గ్రామాల్లోని వారి వద్దకే ప్రభుత్వం వస్తున్నదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్ మండలంలోని తన సొంతగ్రామం రంగారెడ్డి గూడలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరుగ్యారంటీలలో రెండు అమలు చేస్తున్నది మన కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. మిగతావికూడా ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో అమలు చేస్తారని అన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, డీటీ భరత్‌కుమార్, ఆర్ఐ ఖదీర్, ఉపసర్పంచ్ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

రాజాపూర్: మండల కేంద్రంలో విద్యుత్ ఓవర్‌లోడ్‌తో ఇళ్లలోని పరికరాలు కాలిపోతుండటంతో.. గురువారం సాక్షి దినపత్రికలో ఓవర్‌లోడ్‌తో కాలుతున్న పరికరాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనా ఏర్పాటులో నిర్లక్ష్యం అంటూ కథనం ప్రచురితమైంది. దీంతో శుక్రవారం అధికారులు స్పందించి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేశారు. మరో రెండు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేయగా సాంకేతిక లోపంతో ఆలస్యం జరిగిందని వాటిని రెండు మూడురోజుల్లో ఏర్పాటు చేస్తామని లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో రాజాపూర్ సర్పంచ్ కొప్పెరిబచ్చిరెడ్డి, గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తితోనే మానసిక ప్రశాంతత


పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు మధుసుదన్‌రెడ్డి, మేఘారెడ్డి

భూత్పూర్: భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దిగట్లలో పెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథిగా వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాత బత్తిని కాంతారెడ్డి, హరీష్ కుమార్ రెడ్డిలను ప్రశంసించారు. పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, భూత్పూర్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర నాయకురాలు పద్మజారెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, విండో చైర్మన్ అశోక్ రెడ్డి, సర్పంచ్ ప్రియాంక పాల్గొన్నారు.

6 నుంచి దర్గా ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని సయ్యద్ అబ్దుల్‌ఖాదర్‌షా 85వ దర్గా ఉత్సవాలు వచ్చేనెల 6 నుంచి 8 వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ జమీర్‌ఖాద్రీ తెలిపారు. శుక్రవారం పోస్టర్లను మతపెద్ద సయ్యద్ సఫీర్ అహ్మద్ నక్షబంది, మజీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అహ్మద్ అలీ సనా, అబ్దుల్ జకీ ఆవిష్కరించారు. 6న జలాభిషేకం, 7న గంధోత్సవం, 8న దీపారాధన, రెండు రోజులపాటు ఖవ్వాలి ఉంటాయని వివరించారు. సలాం మాదూమ్, అన్వర్‌పాష, హాజిపాష, అబ్దుల్ ఖదీర్ ఖాద్రీ పాల్గొన్నారు.

అండగా ఉంటా

భూత్పూర్: తాను పదవిలో లేకున్నా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అన్నాసాగర్‌లో మూసాపేట మండల కార్యకర్తల సమావేశంలో ఎంపీ ఎన్నికలపై ఆయన సూచనలు చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


మహమ్మదాబాద్‌లో పల్లకీసేవ


అడ్డాకులలో..

మహమ్మదాబాద్: మండలంలోని కాంతిమల శిఖరంపై అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. శుక్రవారం జరిగిన అయ్యప్ప మహాపడిపూజకు ఉమ్మడి మండల వ్యాప్తంగా వేలాదిగా భక్తులు హాజరయ్యారు. వేడుకలో భక్తులు ఇచ్చిన కానుకలతో అయ్యప్పకు కనకాభిషేకం చేశారు. ఈ డబ్బులను వేలం వేయగా.. రూ. లక్షా డెబ్బై అయిదే వేలకు హన్వాడకు శ్రీను గురు స్వామి దక్కించుకున్నారు. భక్తులకు బీఆర్ఎస్ అధ్యక్షుడు సరోజాపెంట్యానాయక్ అన్నదానం చేశారు. శ్రీనివాస్, రాజు, లక్ష్మీకాంత్, గోపాల్, బాల్‌రాజ్, గోవర్ధన్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కమతం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట హరిహర అయ్యప్ప క్షేత్రం వద్ద సంకల్పసిద్ధి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి అభినందించారు.

సర్వసభ్య సమావేశానికి డుమ్మా!

అధికసంఖ్యలో ప్రజాప్రతినిధుల గైర్హాజరు

నవాబుపేట: మండల సర్వసభ్య సమావేశానికి శుక్రవారం ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. సభలో ఎక్కువమంది అధికారులో ఉండడం, ప్రజాప్రతినిధులు తక్కువ సంఖ్యలో ఉండడంతో కేవలం 48 నిమిషాల్లో ముగించేశారు. ఎంపీపీ అనంతయ్య అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో ఒక్కో శాఖపై 5 నిమిషాలు కూడా చర్చ జరగకపోవడం గమనార్హం. మండలంలో 54 గ్రామాల సర్పంచ్‌లు, 19 మంది ఎంపీటీసీ సభ్యులు ప్రస్తుతం ఉండగా .. శుక్రవారం సభలో 9 మంది ఎంపీటీసీలు, 4 గ్రామాల సర్పంచ్‌లు, నలుగురు సర్పంచ్‌లకు బదులు వారి భర్త, కుమారులు మాత్రమే వచ్చారు. అధికారులు దాదాపుగా 41 మంది పాల్గొన్నారు. కాగా విద్యుత్ బిల్లుల రాయితీ, రైతులకు రైతు భరోసా పథకం త్వరగా అమలు చేయాలని అధికారులను సభకు హాజరైన సభ్యులు కోరారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీడీఓ శ్రీలత, ఆర్ఐ గోవర్ధన్, ఏఈలు పాల్గొన్నారు.

కాళికాదేవి.. కరుణించు





మహబూబ్‌నగర్ రూరల్: రామచంద్రాపూర్‌లో శుక్రవారం సాయంత్రం శ్రీ ఎల్లమ్మ దేవత సిడే అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాళీకాదేవి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన కార్యక్రమాన్ని కనుల పండువగా జరిగింది. సిడే తిప్పే గొర్రె పొట్టేలును ముందుగా గ్రామంలోని బొడ్రాయి వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పొలిమేర వద్ద ఎల్లమ్మ దేవత గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుర్వ ఆనంద్ ఆధ్వర్యంలో సిడెకు పొట్టేలును కట్టి ఎల్లమ్మ గుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు రావడంతో ఈ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. మహోత్సవాల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సిములు, గ్రామ సర్పంచ్ కుర్వ రాణెమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.